# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 4, ఏప్రిల్ 2026


# సర్పంచ్ ఆత్మహత్య




**ఖానాపూర్, ఏప్రిల్ 03, ప్రభాతవార్త**

నిర్మల్ జిల్లా కడెం మండలం మాసాయిపేట గ్రామ సర్పంచ్ దుర్గం లహరిక (29) శుక్రవారం పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. లహరిక గుర్తు తెలియని పురుగుల మందు సేవించడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు, ఆమె పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో చికిత్స నిమిత్తం కారులో ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే మార్గమధ్యలో వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి నిలిపి ఉంచిన ట్రాక్టర్ నాగళ్లను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో, వెంటనే ఆమెను మరో వాహనంలో ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతురాలికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కేవలం మూడు నెలల క్రితమే మాసాయిపేట సర్పంచ్‌గా లహరిక భారీ మెజారిటీతో ఎన్నికయ్యారు. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియలేదు. కడెం ఎస్సై పి. సాయికిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సర్పంచ్ లహరిక మృతి పట్ల కడెం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జొన్నల చంద్రశేఖర్ గుప్త, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ పార్టీ వైపు ప్రజలు చూస్తున్నారు...







- ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికి చేరాలి
- బీఆర్ఎస్ వదిలేసిన ప్రాజెక్టులను కాంగ్రెస్ పూర్తి చేస్తోంది
- జిల్లాకు అవసరమైన పరిశ్రమలను తెచ్చుకుందాం
- టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వైపు ప్రజలు చూస్తున్నారని, వచ్చే 15 ఏళ్ళు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఉంటుందని టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక రోజ్ గార్డెన్ లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి డిసిసి అధ్యక్షురాలు సుగుణ అధ్యక్షతన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ సావత్ తో కలిసి కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి నియామక పత్రాలు అందించి భాద్యతలు, దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా టిపిసిసి అధ్యక్షుడు మాట్లాడుతూ సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించే విధంగా సభ్యులు కృషి చేయాలని సూచించారు. గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందినప్పుడే దేశము అభివృద్ధి చెందినట్లుగా భావించాలని పేర్కొన్నారు. గడిచిన రెండేళ్ల కాలంలో ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికి చేరేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఉన్న వనరులను గుర్తించి వాటికి అవసరమైన పరిశ్రమలను తెచ్చుకొని అన్ని రకాలుగా జిల్లాను అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి ఆదిలాబాద్ కంచుకోట అని, ఆదిలాబాద్ మిగతా 2లో..



# ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధి

- ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి

**బాసర, ఏప్రిల్ 03, ప్రభాతవార్త:**

రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఈ నెల 6వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసర పర్యటనను పురస్కరించుకుని, శుక్రవారం ఆయన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్‌లతో కలిసి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా బాసరకు చేరుకున్న సుదర్శన్ రెడ్డికి కలెక్టర్ అభిలాష అభినవ్ పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యమంత్రి పూజలు చేసే ప్రదేశం, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసే ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆలయ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. బాసరతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఆలయాలన్నింటినీ అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి బాసర ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. దేశం నలుమూలల నుండి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం మిగతా 2లో..

# ముఖ్యమంత్రి బాసర పర్యటనకు విస్తృత ఏర్పాట్లు



- కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు నిర్వహిస్తాం
- రాష్ట్ర ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ మంత్రి (జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి) జూపల్లి కృష్ణారావు

**నిర్మల్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ నెల 6వ తేదీన బాసర పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిలు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు.ముందుగా బాసర చేరుకున్న మంత్రులకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిలతో పాటు అధికారులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్ఞాన సరస్వతి మిగతా 2లో..

# ఆశ్రమ పాఠశాలలో కల్తీ ఆహారం...

## ఆరుగురు విద్యార్థులకు అస్వస్థత



**పెంచికల్‌పేట్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :**

పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్లూర్ ఆశ్రమ పాఠశాలలో కల్తీ ఆహారం తిని ఆరుగురు విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన శుక్రవారం స్థానికంగా కలకలం రేపింది. విషయం తెలుసుకున్న మండల వైద్యాధికారి డాక్టర్ ఆశ్రీన్ పాఠశాలను సందర్శించి పరిస్థితిని సమగ్రంగా సమీక్షించారు. అస్వస్థకు గురైన విద్యార్థులకు తక్షణమే ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఉన్నత ఆసుపత్రికి తరలించినట్లు, ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని వైద్య వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా డాక్టర్ ఆశ్రీన్ మాట్లాడుతూ ఆహారం తయారీ విధానం, త్రాగునీటి సరఫరా, నిల్వ విధానాలను పరిశీలించారు. పరిశుభ్రతలో లోపాలు ఉండకూడదని సిబ్బందికి స్పష్టం చేశారు. పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

# కాంగ్రెస్ పార్టీ వైపు ప్రజలు చూస్తున్నారు...

(మొదటిపేజీ తరువాయి)

జిల్లాలో నూతన విమానాశ్రయం వస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీలో సభ్యత్వం ఉంటే చాలు ఏ స్థాయిలోనైనా రాణించవచ్చని సభ్యులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వాలు వస్తుంటాయి పోతుంటాయి కానీ పార్టీ మాత్రం శాశ్వతమన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తను గుర్తించి వారికి పదవులు ఇస్తామని భరోసా కల్పించారు. ఎటువంటి ఆలోచన ప్రణాళిక లేకుండా లక్షల కోట్లు ఖర్చు చేసిన బిఆర్ఎస్ ప్రభుత్వం వదిలేసిన ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తోందని, వాళ్లు చేసిన లక్షల కోట్ల అప్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలు కడుతున్నామని వివరించారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలో ఇల్లు లేని కుటుంబం ఉండొద్దనే సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను చేపడుతుందని పేర్కొన్నారు. అంతకుముందు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ సావత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల పార్టీ అని, ముఖ్యంగా ప్రజా ప్రభుత్వమని, ఇచ్చిన హామీలను దశలవారీగా పూర్తి చేసిందని పేర్కొన్నారు. 2028 ఎన్నికల్లో రాష్ట్రం, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభవం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విటల్, డిసిసి అధ్యక్షురాలు సుగుణ, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి శ్యాం నాయక్ మాట్లాడుతూ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు టిపిసిసి అధ్యక్షుడు మొదటిసారి వచ్చిన నేపథ్యంలో శుభకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు ఏళ్ల లో పలు సంక్షేమ పథకాలను ప్రారంభించిందని, రాబోయే కాలంలో మరిన్ని సంక్షేమ పథకాలను ప్రారంభించినట్లు తెలిపారు. అందరూ ఏకతటీగా పనిచేసి పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని, పార్టీలో బీసీలకు పెద్దపీట వేయాలని, నామినేట్ పోస్టులు ఇవ్వాలని, జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను మెరుగుపరుచుకోవాలని, విద్య రంగాన్ని పటిష్టపరుచుకోవాలని, అదేవిధంగా కార్యకర్తలను అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. అనంతరం సంఘాల వారీగా టీపీసీసీ అధ్యక్షున్ని శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసి అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ రావు, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి రాజేష్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అనిల్, ఆసిఫాబాద్, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్లు మంగ, విశ్వనాథ్, మాజీ జడ్పీ చైర్మన్ గణపతి తో పాటు మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధి

(మొదటిపేజీ తరువాయి)

చేసేందుకు అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆలయ ఈవో విజయరామారావు, తహసీల్దార్ పవన్ చంద్ర, నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి బాసర పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

(మొదటిపేజీ తరువాయి)

అమ్మవారిని దర్శించుకున్న అనంతరం వేద పండితులు మంత్రులకు ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఆలయ అభివృద్ధి పనులు చేపట్టబోయే ప్రాంతాల వివరాలను మంత్రులకు వివరించారు. ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేయనున్న ప్రదేశాలను మంత్రులు పరిశీలించి, అధికారులకు కీలక సూచనలు చేశారు. సీఎం పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం రాజన్న అతిథి గృహంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బాసర అభివృద్ధి పనులకు సంబంధించి రూ.300 కోట్లతో దేవాలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరుస్తామని తెలిపారు. దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. అలాగే గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో ఘనంగా నిర్వహించేలా చర్యలు చేపడతామని వెల్లడించారు. ఈ నెల 6న ముఖ్యమంత్రి చేతుల మీదుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరుగనున్నాయని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముధోల్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు పవార్ రామారావు పటేల్, వెడ్మా బొజ్జు పటేల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏఎస్పీలు సాయి కిరణ్, ఉపేంద్ర రెడ్డి, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, భైంసా మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, ఆలయ ఈవో విజయరామారావు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి

- టీపిసిసి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్
- ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి
- పార్టీ కోసం కష్టపడే వారికి తగిన గుర్తింపు రావడం లేదు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు





**మంచిర్యాల, ఏప్రిల్ 03, ప్రభాతవార్త**

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని తెలంగాణ పి.సి.సి ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎంఎన్ఆర్ గార్డెన్‌లో రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఉమ్మడి జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావద్, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, ఎమ్మెల్సీ దండే విటల్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ లు హాజరయ్యారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మంచిర్యాల జిల్లాలో ఇటీవల నూతనంగా నియమితులైన మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి తో పాటు నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన సభ్యులకు మంత్రులు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. బిఆర్ఎస్ నిర్బంధ పాలనలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు చాలా ఇబ్బందులు పడ్డారని, అక్రమ కేసులు సైతం అనుభవించారని అన్నారు. కార్యకర్తల వల్లే ఈరోజు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, దేశంలో కాంగ్రెస్ పార్టీకి గొప్ప చరిత్ర ఉందని తెలిపారు. 65 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో, టిడిపి పాలనలో చేయలేని అప్పులు గత బిఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏండ్లలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని ఆరోపించారు. కెసిఆర్ హయాంలో 8 లక్షల కోట్ల అప్పులు దాటాయని అప్పులకు వడ్డీలు కడుతూనే సంక్షేమ పథకాలు అందిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో బియ్యం అక్రమ స్మగ్లింగ్ జరిగిందని బిఆర్ఎస్ నాయకులు వేల కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించారని దుయ్యబట్టారు. శ్రీరామచంద్రుడు బిజెపి పార్టీ జాగీరుల ప్రచారం చేసుకుంటున్నారని, మతాల పేరిట రాజకీయాలు చేస్తున్నారని ,రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేశారని ఆరోపించారు. పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో పేద ప్రజలకు సన్నబియ్యం అందిస్తుందని అన్నారు. బిజెపి పార్టీ దేశవ్యాప్తంగా సన్నబియ్యం ఎందుకు పంపిణీ చేయడం లేదో తెలపాలని అన్నారు. రాష్ట్రాన్ని దోచుకున్న సొత్తులో కేసీఆర్ కుటుంబంలో తగాదాలు జరుగుతున్నాయని అన్నారు. కుల మతాలను రెచ్చగొట్టే బిజెపి పార్టీకి తెలంగాణలో అవకాశమే లేదని తేల్చి చెప్పారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇప్పుడిప్పుడే గాడిలో పెడుతున్నామని, సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలతో విదేశీ పెట్టుబడులు వస్తున్నాయని అన్నారు.

### ఆర్థిక ఇబ్బందులు ఎదురైన సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం...

**- ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు...**

తెలంగాణ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా సరే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, ఎన్నికలకు ముందు ఇచ్చిన 6 గ్యారంటీల పథకాలను అమలు చేస్తున్నామని ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన అప్పులకు వడ్డీలు కడుతున్నామని అన్నారు. రాహుల్ గాంధీ, సోనియా గాంధీ కుటుంబం త్యాగాల కుటుంబమని, కాంగ్రెస్ పార్టీ కోసం ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ ప్రాణాలు సైతం అర్పించారని గుర్తు చేశారు. ప్రధానమంత్రి పదవి అవకాశం వచ్చినా సరే సోనియా గాంధీ చేపట్టలేదని అన్నారు. పార్టీలో కష్టపడ్డ వారికి పదవులు వస్తాయని, పార్టీ గుర్తింపు ఇస్తుందని తెలిపారు.

### కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలి....

**- కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి**

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. పార్టీలో సీనియార్టీ ప్రాతిపదికన పదవులు ఇస్తున్నామని, కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసే వ్యక్తులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అన్ని పార్టీల్లో గ్రూప్ రాజకీయాలు ఉంటాయని అవి అన్ని పక్కన పెట్టి పార్టీ కోసం పని చేయాలని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ 10 ఏండ్లు చేసిన అరాచకాలను కాంగ్రెస్ పార్టీ ఎత్తి చూపిందని, కాంగ్రెస్ పార్టీ పై ,ప్రభుత్వం పై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ప్రతి ఒక్కరు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గత బిఆర్ఎస్ పరిపాలనలో తెలంగాణ రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని, కాలేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ పథకాల్లో భారీ అవినీతి జరిగిందని, వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి అప్పుల రాష్ట్రంగా మిగిల్చారని మండిపడ్డారు.

### పార్టీ కోసం పనిచేసిన వారికి సరైన గుర్తింపు రావడం లేదు..

**- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు...**

కొత్తగా వచ్చిన వారు వేదికల మీద కూర్చుంటే కాంగ్రెస్ బతకదని గుర్తించుకోవాలని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలంటే పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తను గుర్తించాలని, కొత్తగా చేరిన వారిని ముందు వరసలో నిలబెట్టి కరుడుగట్టిన కాంగ్రెస్ కార్యకర్తలను అవమానించొద్దని అన్నారు. అధికారం ఉందని వచ్చిన వారు అధికార మార్పిడి జరిగితే ఎవరూ ఉండరని, ఎన్ని కష్టాలు ఎదురైనా కాంగ్రెస్ లో పనిచేసిన కార్యకర్తలను గుర్తించి సముచిత స్థానం కల్పించి, గౌరవించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు పనిచేశామని, గత ప్రభుత్వ హయాంలో అనేక ఇబ్బందులు పడ్డామని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో పార్టీ కోసం కష్టపడ్డ వారికే అవకాశం ఇస్తేనే మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని, ఇది గుర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## సీసీ రోడ్డు భూమి పూజ

**వాంకిడి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :**

వాంకిడి మండలం దొడ్డిగూడ గ్రామంలో 3లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గురునులే నారాయణ భూమి పూజ చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడు తు న్నాయని అన్నారు. గ్రామ ప్రజలకు మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించడం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సెల్వాట్కార్ పేంటు, నాయకులు జాబోరే గణేష్, ఉప్రే ధర్మ,ఉప సర్పంచ్ భీంరావ్ , ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ బాజీరావు గ్రామ కార్యదర్శి రమాదేవి, వార్డ్ మెంబర్ వాడై ఉమేష్.సిదాం అయ్యు, గ్రామపటేల్ గురనులే డోదజీ,వాడై పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.



# సమగ్ర గిరిజనాభివృద్ధికై సంస్థ పని చేస్తుంది

**- ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్**

**ఉట్నూర్, ఏప్రిల్ 3,ప్రభాతవార్త :**

సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కొరకు పని చేస్తుందని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. శుక్రవారం సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో డిప్యూటీ కలెక్టర్ల బృంద సభ్యులతో సంక్షేమ పథకాల అమలు, గిరిజనులకు కల్పిస్తున్న విద్య, వైద్యం, గిరిజనులకు, పి.వి.టి.జి. లకు అందిస్తున్న సంక్షేమ పథకాల ఫలాలపై ముఖాముఖ చర్చించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అధికార యంత్రాంగం సమన్వయంతో సమర్ధవంతంగా అమలు చేస్తూ అర్హులైన గిరిజనులకు పథకాల ఫలాలు అందే విధంగా క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్నామని తెలిపారు. గిరిజనుల అభివృద్ధి కొరకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ పరిధిలోని అర్హత గల ప్రతి గిరిజనుడికి అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం రెండు రోజుల క్షేత్ర పర్యటనలో భాగంగా విచ్చేసిన 20 మంది డిప్యూటీ కలెక్టర్ల బృందం ఐటిడిఏ ఉద్యాన అధికారి గుడిమల్ల సందీప్ కుమార్ ఆధ్వర్యంలో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూర్ పరిధిలోని ఉద్యాన నర్సరీ, శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఉద్యాన అధికారి నర్సరీలో చేపడుతున్న వివిధ కార్యక్రమాలను అధికారుల బృందానికి వివరించారు. వివిధ రకాల పండ్ల తోటల పెంపకం, సాగు మెలకువలు, అంట్లు కట్టే విధానము, కొమ్మలు కత్తిరించే విధానము, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, కూరగాయల నారు పెంపకం, వేసవిలో పండ్లు, కూరగాయల పెంపకంలో తీసుకోవలసిన జాగ్రత్తలు మొదలైన అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా బృంద సభ్యులు మాట్లాడుతూ తమలో ఎక్కువ మంది అధికారులు వ్యవసాయ నేపథ్యం నుంచి వచ్చిన వారు ఉన్నారని తెలిపారు. బృంద సభ్యులు వివిధ రకాల పంటలకు సంబంధించిన పలు ప్రశ్నలను ఆసక్తిగా అడిగి సమాచారాన్ని తెలుసుకున్నారు. అనంతరం ఉట్నూర్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రిలో కల్పిస్తున్న వైద్య సేవలు, మందుల నిల్వల వివరాలు, ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, పారిశుధ్య నిర్వహణ, విద్యా బోధన తీరు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమం లో ఐటీడీఏ ఏ పి ఓ దామోదర్ స్వామి, పి వి టి జీ ఏ పి ఓ ఆత్రం భాస్కర్, ఆసుపత్రి సూపరిడెంట్ డాక్టర్ ఉపేందర్ జాదవ్, డి డి అంబాజీ జాదవ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకం, పాఠశాలను సందర్శించిన 20 మంది సబ్ కలెక్టర్లు



చెక్కును అందజేస్తున్న సర్పంచ్ బొడ్డు స్పందన గంగన్న

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

**ఖానాపూర్, ఏప్రిల్ 03, ప్రభాతవార్త:**

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సూచనల మేరకు మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఉరే రమేష్‌కు మంజూరైన రూ. 60,000/ విలువ గల చెక్కును సర్పంచ్ బొడ్డు స్పందన గంగన్న లబ్ధిదారుడికి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఆపద కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో భరోసానిస్తుందని తెలిపారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. గ్రామస్థులు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొడ్డు గంగన్న, వార్డు సభ్యుడు ఉదయ్, వీడీసీ ఉపాధ్యక్షుడు రాజన్న, కార్యకర్తలు పి. నారాయణ, పోషన్న, పి. రాజేష్, వెంకటేష్, భూమేష్, జె. రాజేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మోసపూరిత మెయిల్స్, సందేశాలను తెరవకూడదు

**జన్నారం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**




ఈ మధ్య కాలంలో సైబర్ నేరాలు రోజురోజుకు విపరీతంగా పెరిగిపోతున్నాయి. చదువురాని వాళ్ళే కాకుండా చదువుకున్న వారు కూడా సైబర్ నేరగాళ్ల మాయలో పడి లక్షల రూపాయలు పోగొట్టుకుంటున్నారు. అందుకే ప్రజలకు పోలీసు సిబ్బంది వారు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం నాడు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో స్థానిక పోలీసు శాఖ వారు సైబర్ నేరాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపరిచిత కాల్స్ వచ్చినప్పుడు కొంచెం జాగ్రత్త వహించాలని, మీ వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ ఇవ్వకూడదని, బ్యాంక్ సిబ్బంది ఎప్పుడూ మీ వివరాలను అడగదని అలాంటి ఫోన్ కాల్స్ వస్తే మీ వివరాలు కానీ అలాగే ఓటిపీలు చెప్పకూడదని సూచించారు. మీ డబ్బు పోగొట్టుకుంటే వెంటనే 1930 నెంబర్ కు ఫోన్ చేసి కంప్లైంట్ ఇవ్వాలని కోరారు. అలాగే ఇంటర్నెట్ ద్వారా చేసే మోసాలు అంటే ఆన్ లైన్ షాపింగ్, పెట్టుబడి మోసాలు కూడా ఎక్కువగా జరుగుతున్నందున జాగ్రత్త వహించాలని అన్నారు.

## నేడు క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బిఎన్ఎస్ 163 అమలు

**- ఏసిపి కిరణ్ కుమార్**

**క్యాతన్‌పల్లి,ఏప్రిల్ 03,ప్రభాతవార్త**



వాయిదా పడిన మున్సిపాలిటీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉన్న నేపథ్యంలో నేడు క్యాతన్‌పల్లి పురపాలక పరిధిలో బి.ఎన్.ఎస్ 163(144 సెక్షన్) విధించినట్లు బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్ తెలియజేశారు. శుక్రవారం రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రామగుండం పరిధిలోని సీఐలకు, ఎస్ఐలకు, పోలీస్ సిబ్బందికి చైర్మన్ ఎన్నిక సంబంధించి బందోబస్త్ నిర్వహణ పై కీలక సూచనలు చేశారు. 163 సెక్షన్ ఉదయం 6 గంటల నుంచి అమలులో ఉంటుందని, పుర ప్రజలు సహకరించాలని కోరారు. మంచిర్యాల వెళ్లే దారులను మళ్లించడం జరుగుతుందని ప్రయాణికులు గమనించి పోలీసుల సూచనలు పాటించాలని కోరారు. నలుగురు ఏసిపిలు, 25 మంది సీఐలు, 32 మంది ఎస్ఐలు సుమారు 600 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారని తెలిపారు.



## పెద్ద హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రత్యేక పూజలు

**నేరడిగొండ, ఏప్రిల్ 03, ప్రభాతవార్త:**

హనుమాన్ జయంతిని పురస్కరించుకుని నేరడిగొండ మండల కేంద్రంలోని పెద్ద హనుమాన్ ఆలయాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. హనుమంతుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కుర్మె నారాయణస్వామి, వీడీసీ చైర్మన్ రవీంద్ర రెడ్డి, మాజీ ఎంపీపీ సజన్, పార్టీ కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలి: ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ, ఏప్రిల్ 03, ప్రభాతవార్త:**



ఏప్రిల్ 14న ఇంద్రవెల్లి మండల కేంద్రంలో నిర్వహించనున్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించి, జయప్రదం చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం నేరడిగొండ మండల కేంద్రంలోని తన నివాసంలో ఇంద్రవెల్లి మండల అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆయన ఉత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశానికి దిశానిర్దేశం చేసిన మహనీయుడు అంబేద్కర్ అని, ఆయన ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. జయంతి వేడుకలను మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్ కాంబ్లే జితేందర్, అనిల్ రాథోడ్, రత్న సాన్వి వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్ సత్యరాజ్ ఉపారపు, గౌరవ అధ్యక్షుడు కాంబ్లే మనోజ్, ప్రధాన కార్యదర్శి కాంబ్లే మారుతి, నాయకులు సావంత్ లహుదాస్, సుద్ధోధన్, సంజీవ్, భుజంగ్ తదితరులు పాల్గొన్నారు.



## బుద్ధ విహార్‌లో 19వ రోజుకు చేరిన అంబేద్కర్ జ్ఞాన దీక్షలు

**నిర్మల్, ఏప్రిల్ 03, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా కేంద్రంలోని బుద్ధ విహార్‌లో నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జ్ఞాన దీక్ష, భీమ్ దీక్షలు శుక్రవారం 19వ రోజుకు చేరుకున్నాయి. సారంగాపూర్ మండలం మలక్ చించోలి గ్రామానికి చెందిన అంబేద్కర్ యువజన సంఘం నాయకుడు సాయేందర్ అంబేద్కర్ ఈ దీక్షలను స్వీకరించి కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా బుద్ధ విహార్ కమిటీ అధ్యక్షుడు కుంటోల్ల వెంకటస్వామి సమక్షంలో ప్రత్యేక గ్రంథ పఠనం నిర్వహించారు. అనంతరం దీక్షా పరులకు పండ్ల రసాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు కొంతం మురళీధర్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఈరోల పురుషోత్తం పాల్గొన్నారు. ఈ జ్ఞాన దీక్షలు ఏప్రిల్ 14న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వరకు నిరంతరాయంగా కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

## గంజాయి నివారణకు కిరాణా దుకాణాల్లో తనిఖీలు: ఎస్సై శ్రీకాంత్

**సారంగాపూర్, ప్రభాతవార్త:**



మండల కేంద్రంలో గంజాయి వ్యాప్తిని అరికట్టేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక ఎస్సై శ్రీకాంత్ శుక్రవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని పలు కిరాణా దుకాణాలను తనిఖీ చేసిన పోలీసులు, నిషేధిత పదార్థాల విక్రయాలు జరగకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశారు. అనంతరం ఎస్సై స్థానిక ప్రజలు, వ్యాపారులతో కలిసి గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత భవిష్యత్తును దెబ్బతీసే గంజాయి వంటి మత్తు పదార్థాలను నిరోధించేందుకు ప్రజల సహకారం అవసరమని కోరారు. గంజాయి విక్రయం లేదా వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలపాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ప్రేమ్ సింగ్, మాధవ్, వినిల్ రెడ్డి, లింగరం, శ్రీలత పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ పోరాటవీరుడు దొడ్డి కొమురయ్య

*** జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**





నివాళులర్పిస్తున్న కురుమ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య

**నస్పూర్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**

నిజాం నిరంకుశ పాలనలో ప్రజల సంక్షేమం, భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ ఉద్యమంలో దొడ్డి కొమురయ్య అలుపెరుగని పోరాటం చేశారని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమరయ్య జయంతి ఉత్సవాలకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, వెనుకబడిన తరగతుల కులాల సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనలో అణిచివేతకు గురవుతున్న ప్రజల ఆత్మగౌరవం, భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటం ఉద్యమంలో దొడ్డి కొమురయ్య వీరోచిత పోరాటం చేశారని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న పరిస్థితులపై చైతన్యపరిచి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేశారని తెలిపారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం దొడ్డి కొమురయ్య చేసిన పోరాటం యువతకు మార్గదర్శకమని తెలిపారు. దేశ స్వాతంత్రం, ప్రజల సంక్షేమం కోసం వీరోచితంగా పోరాడి, ప్రాణ త్యాగాలు చేసిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహాల సంక్షేమ అధికారులు, యాదవ, కురుమ కుల సంఘాల ప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**మంచిర్యాల, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**

మంచిర్యాల పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల అమరవీరుల స్తూపం వద్ద శుక్రవారం రోజు జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తొలి అమరుడు గా పేరు తెచ్చుకున్న వ్యక్తి ఉమ్మడి నల్గొండ జిల్లా సూర్యపేట తాలూకాలోని సూర్యాపేట కడవెండి గ్రామంలో జన్మించారని, గొల్ల కురుమ వర్గానికి చెందిన యువకుడిగా భూస్వాముల రజాకర్ల అక్రమ కట్టుబాటు వ్యవస్థలకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేసిన యువ నాయకులలో ఒకరు రైతాంగ పోరాటంలో నిజాం రాజ్యకాలంలో దేశ్ముఖ్ జమీందారుల దోపిడి రజాకార్ల వ్యవస్థ కారణంగా తెలంగాణ రైతాంగం తీవ్రంగా బాధపడుతున్న సమయంలో సాయుధ స్వరూపం తీసుకుంది కొమురయ్య కడవెండి పరిసర గ్రామాల్లో ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో రైతు ప్రజాసంఘాలను ఏర్పరిచి వెట్టి చాకిరి అధిక పన్నులకు వ్యతిరేకంగా ఉద్యమాలను ముందుండి నడిపారు ఇలాంటి యోధుడికి రాష్ట్ర ప్రభుత్వం సరైన గుర్తింపు ఇవ్వాలని, హైదరాబాదులోని ట్యాంక్ బండ్ పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, అలాగే మంచిర్యాల జిల్లా కేంద్రంలో కూడా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, సీనియర్ నాయకులు కర్రె లచ్చన్న, చంద్రగిరి చంద్రమోళి, గోలివాడ నర్సింహులు, కీర్తి రవి, వేముల అశోక్, అంకం సతీష్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**సారంగాపూర్, ఏప్రిల్ 03, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 99వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కురుమ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. కడివెండి గ్రామంలో జన్మించి, సామాన్య గొర్రెల కాపరిగా జీవితాన్ని ప్రారంభించిన ఆయన.. విసునూరి దేశ్ముఖ్ అరాచకాలకు, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా పోరాడారని గుర్తు చేశారు. జమీందారీ వ్యవస్థలోని అకృత్యాలను ఎదిరించి ప్రాణత్యాగం చేసిన ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కురుమ సామాజిక వర్గం తెలంగాణ ఉద్యమాల్లో ఎప్పుడూ క్రియాశీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోనేరు భూమన్న, నిర్మల్ జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు రాజారాం, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, నాయకులు సట్వాజి, కుల సంఘం అధ్యక్షుడు మల్లేష్, సభ్యులు పాల్గొన్నారు.

**నిర్మల్, ఏప్రిల్ 03, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీవో రత్న కళ్యాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా దొడ్డి కొమురయ్య చిత్రపటానికి ఆర్డీవోతో పాటు పలువురు అధికారులు, కుల సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం సాగిన పోరాటంలో దొడ్డి కొమురయ్య ప్రదర్శించిన సాహసం అమోఘమని కొనియాడారు. వెట్టిచాకిరీ విముక్తి కోసం ప్రాణత్యాగం చేసిన ఆయన పోరాట పటిమ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, జిల్లా కురుమ సంఘం నాయకులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఆర్డీవో రత్న కళ్యాణి




అమరవీరుల స్థూపం వద్ద దొడ్డి కొమరయ్యకు నివాళులర్పిస్తున్న దృశ్యం

# కార్మికుల ఆరోగ్యమే సంస్థ ప్రగతికి పునాది

## ఎండల దృష్ట్యా పనివేళలు మార్పు, ఓఆర్ఎస్-మజ్జిగ సరఫరా కోరుతూ వినతి

**మందమర్రి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో మందమర్రి డివిజన్ పరిధిలో పనిచేస్తున్న సివిక్, సివిల్ కాంట్రాక్టు కార్మికుల ఆరోగ్య రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో అధికారులు వద్ద వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ, కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ ఆరోగ్యంగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ఎండల తీవ్రత కారణంగా కార్మికులు డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పని వేళలను ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు మార్చాలని సూచించారు. అదేవిధంగా కార్మికులకు ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు, చల్లటి మంచినీళ్ల పని ప్రదేశాల్లో అందుబాటులో ఉంచాలని కోరారు. అధికారులు వెంటనే స్పందించి కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని, ఎండ దెబ్బ నుంచి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి అల్లి రాజేందర్‌తో పాటు సివిక్, సివిల్ కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

# ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఆరోపణలు అవాస్తవం: ఉపాధి కూలీల వెల్లడి

**సారంగాపూర్, ఏప్రిల్ 03, ప్రభాతవార్త:**



లక్ష్మణచాంద మండలంలోని పీచర గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌పై వస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని గ్రామ ఉపాధి కూలీలు స్పష్టం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలకు పాల్పడుతున్నారని, కూలీల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారని కొందరు చేస్తున్న ప్రచారంలో నిజం లేదని వారు పేర్కొన్నారు. శుక్రవారం ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశంలో సుమారు 280 మంది కూలీలు సమావేశమై తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. ఫీల్డ్ అసిస్టెంట్ తమను ఎప్పుడూ ఎలాంటి ప్రలోభాలకు గురిచేయలేదని, సక్రమంగానే పనులు నిర్వహిస్తున్నారని ముక్తకంఠంతో తెలిపారు. కావాలనే కొందరు అసత్య ఆరోపణలు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. నిరుపేద కుటుంబాలకు చెందిన కూలీల జీవనోపాధిని దెబ్బతీసేలా ప్రచారం చేస్తున్న వారిపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఒకవేళ ఎవరైనా డబ్బులు ఇచ్చి ఉంటే, అటువంటి వారిని కూడా శిక్షించాలని కోరారు. నిరాధారమైన ఆరోపణలతో క్షేత్రస్థాయి సిబ్బందిని ఇబ్బంది పెట్టవద్దని కూలీలు విజ్ఞప్తి చేశారు.




శక్తి అవార్డు 2026 అవార్డు పొందిన రేవతి సునీల్ కుమార్

## మహిళల సాధికారత సేవలకు గౌరవం

### - రేవతి సునీల్ కుమార్‌కు నారీ శక్తి అవార్డు 2026

కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :

సమాజంలో మహిళల సాధికారత కోసం విశేష కృషి చేస్తున్న కాగజ్‌నగర్‌కు చెందిన స్పార్ష్ సోషల్ ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీమతి రేవతి సునీల్ కుమార్ జేకే ఆర్గనైజేషన్ అందజేసే ప్రతిష్టాత్మకమైన నారీ శక్తి అవార్డు 2026" లభించింది. మహిళల అభివృద్ధి, సామాజిక మార్పు, సేవా కార్యక్రమాలలో ఆమె చూపించిన అంకితభావం, నాయకత్వం ఈ అవార్డు సాధనకు ప్రధాన కారణమయ్యాయి. ఈ అవార్డు కార్యక్రమంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళల సంకల్పం, పట్టుదల, సమాజంపై చూపుతున్న ప్రభావాన్ని గుర్తించి సత్కరించారు. రేవతి సునీల్ కుమార్ స్పార్ష్ సోషల్ ఫౌండేషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు, మహిళల సాధికారత, విద్యా అభివృద్ధి వంటి అనేక సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఆమె సేవలు స్థానిక స్థాయిలోనే కాకుండా విస్తృతంగా గుర్తింపు పొందుతున్నాయి. ఎమర్జింగ్ లీడర్స్ నుంచి చేంజ్ క్యాటలిస్ట్స్ వరకు మహిళల విజయాలను ప్రోత్సహించే ఈ అవార్డులు, సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడంలో ముందుండే వ్యక్తులను ప్రోత్సహిస్తున్నాయి. ఈ సందర్భంగా స్పార్ష్ సోషల్ ఫౌండేషన్ సభ్యులు, స్థానిక ప్రజలు రేవతిని అభినందిస్తూ, ఆమె మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ అవార్డు ద్వారా సంస్థకు మరింత గుర్తింపు రావడంతో పాటు, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలకు ప్రేరణ లభిస్తుందని పేర్కొన్నారు.

## నిరుపేదల పెన్నిధి చెన్నూర్ లయన్స్ క్లబ్: ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతం

### - 73 మందికి కంటి పరీక్షలు.. 40 మందికి ఉచితంగా ఆపరేషన్లు; ముఖ్య అతిథిగా హాజరైన సి.ఐ బన్సీలాల్

చెన్నూర్, ఏప్రిల్ 03, 2026 ప్రభాతవార్త

చెన్నూర్ పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేదల కోసం ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరం ఘనంగా నిర్వహించబడింది. కరీంనగర్ రేకుర్తిలోని డాక్టర్ భాస్కర్ మడేకర్ ఉదార నేత్ర వైద్యశాల సౌజన్యంతో, వైస్ చైర్మన్ లయన్ చిదుర సురేష్ సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ జాడి తిరుపతి అధ్యక్షతన జరిగిన ఈ శిబిరానికి చెన్నూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ ఆర్.బన్సీలాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ శిబిరంలో మొత్తం 73 మందికి బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న 40 మందిని గుర్తించి, వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించేందుకు రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలిస్తున్నట్లు ఆసుపత్రి ప్రతినిధి ప్రభాకర్ తెలిపారు. ప్రెసిడెంట్ జాడి తిరుపతి మాట్లాడుతూ.. ఆపరేషన్ చేయించుకునే వారికి ఉచిత భోజనం, వసతి, బస్సు ప్రయాణ సౌకర్యాలు కల్పిస్తున్నామని, పేషెంట్ల వెంట వెళ్లే సహాయకులకు కూడా ఉచిత భోజన వసతి ఉంటుందని పేర్కొన్నారు. ఆదివారం నాడు ఆపరేషన్ పూర్తయిన వారిని తిరిగి చెన్నూర్ చేరుస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్పర్సన్ లయన్ మోథుంపురం వెంకటేశ్వర్, కార్యదర్శి సౌడం శ్రీనివాస్, కోశాధికారి నిమ్మల సాగర్, లయన్స్ క్లబ్ సభ్యులు కట్ల మహేందర్, పల్లె సతీష్ గౌడ్, బుద్ధారపు ప్రకాష్ బాబు, కొత్తూరు దుర్గా ప్రసాద్, బొల్లంపల్లి నాగరాజాగౌడ్, ఉప్పల సతీష్, రావుల మధుకర్, కొమ్మెర నవీన్, గన్ను పాండురంగం పాల్గొన్నారు. అలాగే అంగరాజుపల్లి పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు తమ సేవలను అందించారు.




## ముధోల్ నియోజకవర్గానికి మహర్దశ..

# రూ. 380 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

భైంసా, ఏప్రిల్ 03, ప్రభాతవార్త:

ముధోల్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. ఈ నెల 6వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాకతో నియోజకవర్గంలో నూతన అధ్యాయం మొదలుకానుంది. ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ నిరంతర కృషి ఫలితంగా బాసర ఆలయ పునర్నిర్మాణానికి రూ. 180 కోట్లు, ముధోల్ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి రూ. 200 కోట్లు.. మొత్తంగా రూ. 380 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న బాసర జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణంపై భక్తుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గత పాలకులు బాసర అభివృద్ధిని నిరక్ష్యం చేశారని భావించిన ఎమ్మెల్యే రామారావు పటేల్, శాసనసభ్యుడిగా ఎన్నికైన నాటి నుండి అసెంబ్లీలో పదేపదే ఈ అంశాన్ని ప్రస్తావించారు. ముఖ్యమంత్రి, మంత్రులను కలిసి బాసర మాస్టర్ ప్లాన్ ప్రాధాన్యతను వివరించారు.



ఎమ్మెల్యే పట్టుదలతోనే నేడు ఆలయ రాజగోపురాలు, ఇతర మౌలిక వసతులతో అమ్మవారి క్షేత్రం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దబడనుంది. అలాగే, నియోజకవర్గంలోని వెనుకబడిన విద్యార్థుల కోసం కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు ముధోల్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరైంది. ముధోల్ ఐ హాస్పిటల్ ముందున్న 15 ఎకరాల స్థలంలో రూ. 200 కోట్లతో హైటెక్నాలజీ హంగులతో ఈ పాఠశాల నిర్మాణం జరగనుంది. సుమారు 3 వేల మంది విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసించే అవకాశం కలగనుంది. నియోజకవర్గానికి ఇంతటి భారీ నిధులు రాబట్టడంలో ఎమ్మెల్యే పటేల్ విజయవంతమయ్యారని స్థానికులు కొనియాడుతున్నారు. ఈ నెల 6న ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ పనులకు శంకుస్థాపన జరగనుండటంతో ముధోల్ ప్రాంతం విద్యా, ఆధ్యాత్మిక రంగాల్లో తలమానికంగా నిలవనుంది.

# దొడ్డి కొమురయ్య చరిత్రను భావితరాలకు అందించాలి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :

తెలంగాణ సాయుధ పోరాట రైతాంగ వీరుడు, తొలి అమరుడైన దొడ్డి కొమురయ్య జీవిత చరిత్రను భావితరాలకు అందించాలని ఇన్చార్జి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రమాదేవి అన్నారు. దొడ్డి కొమురయ్య జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ మెంగ్రే ఆకాష్, మాజీ ప్రజా ప్రతినిధులు అరిగెల నాగేశ్వరరావు, మల్లికార్జున్, వెనుకబడిన తరగతుల సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఆనాటి భూస్వాముల ఆగడాలను ఎదిరించి పోరాడి ప్రజలలో చైతన్యం తీసుకువచ్చారని, ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. మహనీయులు అందించిన సేవలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని, మహానుభావుల జయంతి వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈ ఈ సిద్దిక్, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న ఇన్చార్జి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రమాదేవి

# ఉద్యోగి దృఢంగా ఉంటేనే సంస్థ అభివృద్ధి సాధ్యం

### - శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్
### - శ్రీరాంపూర్‌లో ఘనంగా సింగరేణి వార్షిక క్రీడల బహుమతుల ప్రదానం

నస్పూర్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త

ఉద్యోగి ఆరోగ్యంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే విధుల్లో దృష్టి సారించి సంస్థ అభివృద్ధికి దోహదపడతారని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలోని సీఈఆర్ క్లబ్‌లో 2025-26 సింగరేణి వార్షిక క్రీడల బహుమతుల ప్రధానోత్సవం నిర్వహించారు. వివిధ క్రీడలు, కళా పోటీల్లో ప్రతిభ చాటిన విజేతలకు బహుమతులు అందజేశారు. క్రీడల ద్వారానే శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. గత ఏడాది సెప్టెంబర్ 25న ప్రారంభమైన 17 రకాల ఇండోర్, అవుట్ డోర్ క్రీడా పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో రాణించిన శ్రీరాంపూర్ ఏరియా క్రీడాకారులు, కళాకారులను అభినందిస్తూ మునిగంటి శ్రీనివాస్ పురస్కారాలు అందజేశారు. శ్రీరాంపూర్ క్రీడాకారులకు సింగరేణి స్థాయిలోనే కాకుండా కోల్ ఇండియా, జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు ఉందని కొనియాడారు. కంపెనీ స్థాయి పోటీలతో పాటు కోల్ ఇండియా విభాగాల్లో తిరుగులేని ప్రతిభ కనబరుస్తూ ఏరియాకు గర్వకారణంగా నిలిచారని వివరించారు. ఉద్యోగుల రిక్రియేషన్ కోసం సంస్థ స్టేడియాలు, క్లబ్బులు, ఈత కొలనులు, వ్యాయామశాలలు, పార్కులు, వాకింగ్ ట్రాక్స్ ఏర్పాటు చేసింది. ఇటీవల భారీ ఖర్చుతో ఓపెన్ జిమ్‌లు కూడా అందుబాటులోకి తెచ్చింది. వీటిని ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రటరీ బాజీ సైదా, డీజీఎం (పర్సనల్) అనిల్ కుమార్, ఆర్.కె న్యూ టెక్ మేనేజర్ కూరపాటి శ్రీనివాస్, డబ్ల్యూపీఎస్, జీఏ హానరరీ సెక్రటరీ సృజన్ పాల్, స్పోర్ట్స్ సెక్రటరీ చాట్ల అశోక్, పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.




క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న జీఎం మునిగంటి శ్రీనివాస్

# తప్పని గ్యాస్ తిప్పలు..

## - మళ్లీ కట్టెల పొయ్యిలే దిక్కు

**మంచిర్యాల, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**

తెలంగాణలో గ్యాస్ సిలిండర్ల కొరత రోజురోజుకు తీవ్ర రూపం దాల్చుతోంది. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కొన్ని ప్రముఖ హోటల్లలో ప్రత్యేకంగా కమర్షియల్ గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో హోటల్ వ్యాపారులు కుదేలవుతున్నారు. గ్యాస్ ధరలు పెరగడం, సరఫరా తగ్గడం వల్ల సాధారణ ప్రజలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా ప్రాంతాల్లో గ్యాస్ సిలిండర్లు సమయానికి అందక వంట సమస్యలు తలెత్తుతున్నాయి. ఇంటింటా గ్యాస్ కోసం ఎదురుచూపులు పెరుగుతున్నాయి. కొన్ని చోట్ల రోజుల తరబడి సిలిండర్ కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కష్టాల్లో ప్రజలు మళ్లీ పాత పద్ధతుల వైపు అడుగులు వేస్తున్నారు. కట్టెల పొయ్యిలపై వంట చేయడం తిరిగి ప్రాచుర్యం పొందుతోంది. గ్రామాల్లో మాత్రమే కాదు, పట్టణాల్లో కూడా ఈ దృశ్యాలు కనిపిస్తున్నాయి. బ్లాక్ మార్కెట్‌లో గ్యాస్ సిలిండర్లు అధిక ధరలకు అమ్ముతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది సాధారణ ప్రజలపై మరింత ఆర్థిక భారం మోపుతోంది. ప్రభుత్వం డొమెస్టిక్ గ్యాస్ సరఫరా సక్రమంగా ఉందని చెబుతున్నప్పటికీ స్థానిక స్థాయిలో సమస్యలు కొనసాగుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. కట్టెల వంట వల్ల పొగ కారణంగా ఆరోగ్య సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మహిళలు మళ్లీ కట్టెల కోసం తిరగాల్సిన పరిస్థితి రావడం ఆందోళన కలిగిస్తోంది. గ్యాస్ కొరతపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రత్యేకంగా కమర్షియల్ గ్యాస్ సరఫరాను పెంచాలని కోరుతున్నారు. ఈ పరిస్థితి కొనసాగితే మరింత సంక్షోభం తలెత్తే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. గ్యాస్ కష్టాలు ప్రజల జీవన విధానాన్ని మళ్లీ వెనక్కి నెడుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఒక ప్రముఖ హోటల్ ముందు కట్టెలపై మీద వంట చేస్తున్న దృశ్యం

# ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కృషితో ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు

**నేరడిగొండ, ఏప్రిల్ 03, ప్రభాతవార్త:**




మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రత్యేక చొరవతో నియోజకవర్గానికి భారీగా నిధులు, అభివృద్ధి పనులు మంజూరయ్యాయి. ప్రధానంగా ఇచ్చోడ మండల కేంద్రంలో రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు కావడం విశేషం. ఈ నెల 6వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా వీటికి భూమిపూజ నిర్వహించేందుకు ఎమ్మెల్యే అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. నిరుపేద, గిరిజన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అసెంబ్లీలో పలుమార్లు గళమెత్తారు. అభివృద్ధి చెందిన ప్రాంతాల్లోనే కాకుండా వెనుకబడిన బోథ్ నియోజకవర్గంలో ఇటువంటి పాఠశాలలు ఏర్పాటు చేయాలని ఆయన చేసిన పట్టుబట్టారు. ఆయన కృషి ఫలితంగానే నేడు రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, అలాగే పొచ్చర గ్రామంలో ఐటీఐ కళాశాల మంజూరయ్యాయి. విద్యతో పాటు సాగునీటి రంగానికి కూడా ఎమ్మెల్యే ప్రాధాన్యతనిచ్చారు. ఆయన ఒత్తిడి మేరకు బజార్‌హత్నూర్ మండలంలోని పిప్రి, నేరడిగొండ మండలంలోని తేజాపూర్, బుగ్గారం గ్రామాల్లో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు మంజూరయ్యాయి. ఈ నెల 6న పిప్రిలో నిర్వహించే బహిరంగ సభలో ముఖ్యమంత్రి ఈ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. వెనుకబడిన గిరిజన ప్రాంతాల్లో విద్యా సౌకర్యాలు మెరుగుపరిస్తేనే గ్రామీణ విద్యార్థులు రాణిస్తారని అన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం నుండి మరిన్ని నిధులు రాబడతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు, సాగునీటి ప్రాజెక్టుల ద్వారా బోథ్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

# కాగజ్‌నగర్‌లో వీర హనుమాన్ శోభాయాత్ర ఘన విజయం

## - సహకరించిన అందరికీ కృతజ్ఞతలు - హిందూ జాగరణ్ మంచ్ కాగజ్‌నగర్

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :**



మాట్లాడుతున్న హిందూ జాగరణ్ మంచ్ జిల్లా అధ్యక్షులు శివ గౌడ్

కాగాజ్ నగర్ పట్టణంలో గురువారం నిర్వహించిన వీర హనుమాన్ శోభాయాత్ర ఘనవిజయం సాధించడంపై హిందూ జాగరణ్ మంచ్ జిల్లా అధ్యక్షులు శివ గౌడ్ ఆనందం వ్యక్తం చేశారు. శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలోని పాత హనుమాన్ ఆలయంలో హిందూ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో హిందూ జాగరణ్ మంచ్ జిల్లా అధ్యక్షులు శివ గౌడ్ మాట్లాడారు. ఈ శోభాయాత్ర విజయవంతం కావడానికి సహకరించిన జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, మున్సిపల్ అధికారులు, విద్యుత్ శాఖ సిబ్బంది, ఎస్పీఎం యాజమాన్యం, హిందూ జాగరణ మంచ్ కార్యకర్తలకు ఆయన పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. అలాగే దాతల సహకారం విశేషమని పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా నిరంతరం శ్రమించి శోభాయాత్రను విజయవంతం చేసిన హిందూ జాగరణ మంచ్ కార్యకర్తలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి మరిన్ని సనాతన కార్యక్రమాలను నిర్వహించేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. ప్రతి హిందువు ఇలాంటి కార్యక్రమాల్లో ఇంకా చురుకుగా పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హిందూ జాగరణ మంచ్ సభ్యులు పాల్గొన్నారు.



# నాలుగు ఏళ్లుగా అందని భగీరథ నీరు..

## - రోడ్లపై గుంతలతో ప్రజల అవస్థలు

**భైంసా, ఏప్రిల్ 03, ప్రభాతవార్త:**

భైంసా మండలంలోని ఝరి (బి) గ్రామ పరిధిలో గల ఎస్సీ మాదిగ సాటి కాలనీలో గత నాలుగు సంవత్సరాలుగా మిషన్ భగీరథ నీరు అందక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి సమస్యపై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఎటువంటి పరిష్కారం లభించడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ పైపులైన్ పనుల కోసం గ్రామంలోని సిసి రోడ్లను, చిన్న వంతెనను (బ్రిడ్జి) తవ్వి అలాగే వదిలేశారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పైపులైన్ వేసిన తర్వాత ఆ గుంతలను పూడ్చకపోవడంతో రాత్రి సమయాల్లో ప్రయాణికులు, వృద్ధులు ఆ గుంతల్లో పడి గాయపడుతున్నారని తెలిపారు. అభివృద్ధి పేరుతో ఉన్న రోడ్లను ధ్వంసం చేసి, కనీసం తాగునీరు కూడా అందించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మల్ జిల్లా అధికారులు, తానూర్ ఎంపీడీఓ, జిల్లా పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. తవ్విన గుంతలను పూడ్చి, నిలిచిపోయిన తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# చెరువుల రక్షణకు కట్టుదిట్టమైన చర్యలు

## - కాగజ్‌నగర్ తహసీల్దార్ మధుకర్

**కాగజ్‌నగర్, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండువ చెరువు నుంచి అనుమతులు లేకుండా మట్టి అక్రమంగా తరలిస్తున్న ఘటనపై రెవెన్యూ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న కాగజ్‌నగర్ తహసీల్దార్ మధుకర్ స్వయంగా చెరువు పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టి అక్రమ రవాణాకు పాల్పడుతున్న రెండు ట్రాక్టర్లను గుర్తించి స్వయంగా పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ట్రాక్టర్లను స్థానిక ఈస్గాం పోలీసులకు అప్పగించి, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. చెరువుల నుంచి అనుమతులు లేకుండా మట్టి లేదా ఇసుక తరలించడం చట్ట విరుద్ధమని, ఇది పర్యావరణానికి హానికరమని వారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మధుకర్ మాట్లాడుతూ, అక్రమ రవాణాపై ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా మట్టి, ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండి వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.గ్రామస్థులు ఈ చర్యలను స్వాగతిస్తూ, చెరువుల పరిరక్షణకు అధికారులు మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇటీవల ప్రాంతంలో అక్రమ మట్టి రవాణా పెరుగుతుండటంతో అధికారులు ప్రత్యేక దృష్టి సారించడం గమనార్హం.

